www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 2 జులై 2025
5
తిరుపతి



సామాజిక పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆరణి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను తిరుపతి మూడువ డిజవన్ లోని ప్రగతీనగర్‌లో ఎమ్మెల్యే లబ్దిదారుల ఇళ్ళకు వెళ్ళి పంపిణీ చేశారు. ఎన్డీఏ కూటమి నాయకులతోపాటు సిపిఐ నాయకులు పెంచలయ్య పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు పెంచలయ్య కాలనీ సమస్యలను ఎమ్మెల్యేకి వివరించారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోడూరు బాలసుబ్రమణ్యం, సిపిఐ నాయకులు పెంచలయ్య, జనసేన నాయకులు రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతన్నా...వద్దన్నా..!!

- భారీ స్థాయిలో నత్రజని వాడకం
- డిపోల్లో యూరియా కొరత
- నానో ఎరువులపై రైతుల అనాసక్తి





ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈ 'సారి' రబీలో వరి, వేరుశెనగ, సజ్జ పంటలు వేసి ఆశించనంత లాభాలు పొందలేకపోయిన రైతులు ఖరీఫ్‌లో ఆ నష్టాలను పూడ్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. తొలి పంట మొత్తం పెట్టుబడులు, కౌలు సొమ్ము చెల్లించడానికి సరిపోతుండగా.. రెండో పంటలోనే కొంత మిగిలేది. దీంతో రైతులు ఖరీఫ్‌లో వీలైనంత ఎక్కువ దిగుబడి పొందాలన్న ఉద్దేశంతో అధికంగా యూరియా వాడేస్తున్నారు. ఎకరానికి 5-6 బస్తాల వరకు వాడుతున్నారు. ఇలా అతిగా వాడటంతో నేల ఆరోగ్యం దెబ్బతింటోంది. చీడపీడల ఉధృతి సైతం బాగా ఉంటోంది. వాటి నివారణకు మళ్లీ పురుగుల మందులు వాడటంతో పెట్టుబడి ఎక్కువవుతోంది. మరోవైపు ఖరీఫ్‌లో జిల్లాకు కేటాయించిన యూరియా సరిపోక పక్క జిల్లాల నుంచి తెప్పించాల్సి వస్తోంది. అధిక దిగుబడుల కోసం బస్తాలకు బస్తాలు వినియోగించేస్తుండడంతో వ్యవసాయ అధికారులు ఆందోళన చెందుతున్నారు. తూర్పు మండలాల్లోని రైతులు ఎకరాకు 10 బస్తాల చొప్పున యూరియాను వాడేస్తుండడంతో కొరత అధికంగా ఉంటోందని వ్యవసాయాధికారులు అంటున్నారు. శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో అనుకున్న ఖరీఫ్ లక్ష్యాన్ని దాటి ఈ సారి రైతులు వరిసాగుకు దిగారు. సుమారు పదివేల హెక్టార్లలో వారి సాగు చేస్తుండటం గమనార్హం. ప్రస్తుతం తూర్పు మండలాల్లో రెండో దశ యూరియా చల్లకం జరుగుతుంది. డిపోల్లో, రైతు సేవా కేంద్రాల్లో యూరియా నిల్వలు లేకపోవడంతో గత పది రోజులుగా రైతులు ఇబ్బంది పడుతున్న పరిస్థితి. సోమవారం పలు డిపోలకు యూరియా చేరడంతో రైతులు పెద్ద ఎత్తున బారులు తీరి యూరియాను హాట్ కేకుల్లా ఎత్తుకొనిపోవడం కనిపించింది.



యూరియాకోసం షాపులు ముందు బారులు తీరిన రైతులు

ఇలా వినియోగిస్తేనే మేలు

వరి పంటకు సాధారణంగా ఎకరానికి 48 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాష్ అవసరమవుతాయి. రసాయన ఎరువుల రూపంలో అయితే 90 కిలోల యూరియా, 50 కిలోల డీఏపీ, 30 కిలోల ఎంవోపీ కావాలి. అయితే పొటాష్, డిఏపీలకు బదులు రైతులు యూరియానే అధికంగా వినియోగిస్తున్నారు. ఫలితంగా నేల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూరియా నిర్ణీత పరిమాణం కంటే ఎక్కువగా వాడితే భూమి ఆరోగ్యం దెబ్బతింటుందని అధికారులు చెబుతున్నారు. నత్రజని మొక్కలలో పత్రహరితం, డీఎన్ఏ, ఆర్ఎన్ఏల ఉత్పత్తి, మాంసకృతులు, నాణ్యమైన దిగుబడుల సాధనకు ఉపయోగపడ్డా, అదే బ్రహ్మ పదార్థం కాదని అంటున్నారు. యూరియాతో పాటు ఇతర పోషకాలు (భాస్వరం, పొటాష్) ఉన్న ఎరువులు సమపాళ్లలో వాడటంతో నేల ఆరోగ్యం మెరుగుపడి దిగుబడులు సాధించొచ్చని చెబుతున్నారు. అధిక మోతాదులో యూరియా వాడితే పైరు మెతకపడి పురుగులు, తెగుళ్లు ఆశించే ఆస్కారముందనీ, ఇతర పోషకాలూ తగ్గి నాణ్యత దెబ్బతింటుందని అంటున్నారు.

నానో ఎరువులపై రైతుల అనాసక్తి

నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు ఓ వైపు వ్యవసాయ అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు. అయితే అవి శాస్త్రీయంగా నిరూపణ కావకపోవడంతో రైతులు అనాసక్తితో ఉన్నారు. అర లీటరు నానో యూరియా రూ. 220 కే లభిస్తుండగా, ఎకరా పొలం పిచికారికి సరిపోతుంది. అయితే రైతులు ఒక్కో యూరియా బస్తాను రూ. 270 కొని పది చొప్పున ఎకరాకు వినియోగిస్తున్నారని వ్యవసాయ అధికారులు తెలిపారు. నానో యూరియా వల్ల భూసారం దెబ్బతినదనీ, కేవలం మొక్కలు మాత్రమే పీల్చుకొని ఏపుగా పెరగడంతో పాటు, ఆశించినంత దిగుబడులు ఇస్తాయని చెబుతున్నారు. అయినా రైతుల్లో వాటి పట్ల ఆసక్తి లేకపోవడంతో కొనేవారే లేకుండా పోతోంది.

సలహాలు తీసుకోవాలి

తూర్పు మండలాల్లోని రైతులు నత్రజని ఎరువులను అధికంగా వాడటం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించుకుంటే వ్యవసాయం భవిష్యత్తు ప్రమాదంలో పడ్డట్టే. నానో ఎరువుల వాడకం సత్ఫలితాలను ఇస్తాయి. రైతులు భావితరాలను దృష్టిలో పెట్టుకుని ఎరువులను వినియోగించాలి.

\- రమేష్ బాబు, ఏడిఏ శ్రీకాళహస్తి



యూరియా బస్తాలు

అనధికారిక నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

- నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య



నగరపాల సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: అనుమతులు లేకుండా నగరంలో నిర్మిస్తున్న భవనాలు, నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం నగరంలోని 45 వ వార్డు, శివజ్యోతినగర్, ప్రగతి నగర్, అయ్యప్ప కాలని, అంధుల శరణాలయం తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య, అభివృద్ధి పనులను కార్పొరేటర్ అనీష్ రాయల్, వివిధ శాఖల అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. శివజ్యోతి నగర్ వద్ద వేసిన కొత్త రోడ్డులో వాహనాలు పార్కింగ్ చేయడం, మద్యం సేవిస్తున్నారని, రోడ్లలో గుంతలు ఎక్కువగా ఉన్నాయి పూడ్చాలని ప్రజలు కోరారు. పోలీసుల సాయంతో వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. డ్రైనేజీ కాలువల్లో ఉన్న చెత్తను తొలగించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపై గుంతలను పూడ్చాలని ఆదేశించారు. బైపాస్ రోడ్డులోని ఓరియన్ హోటల్ నుండి మురుగునీటి కాలువల్లో కలుస్తున్న వ్యర్థాలను అరికట్టి తగు చర్యలు చేపట్టాలని హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డి.ఈ. రమణ, శిల్ప, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, ఏసీపీ మూర్తి, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, తదితరులు ఉన్నారు.

జాతీయ సదస్సుకు
మేయర్‌ను ఆహ్వానించకపోవడం అన్యాయం

- కేంద్ర మంత్రికి ఎంపీ గురుమూర్తి ఫిర్యాదు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్, సిటి : హర్యానా లోని గురుగ్రామ్ లో 3, 4 తేదీల్లో "రాజ్యాంగం ప్రజాస్వామ్యం, జాతి నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర" అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించ నున్నారు. ఈ కార్యక్రమానికి తిరుపతి మేయర్ డాక్టర్ శిరీషను ఆహ్వానించకుండా, డిప్యూటీ మేయర్‌ను నామినేట్ చేస్తూ ప్రభుత్వం జిఓ జారీ చేయడంపై తిరుపతి పార్లమెంటు సభ్యులు డా.మద్దిల గురుమూర్తి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ ఉల్లంఘనపై కేంద్ర హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వశాఖా మంత్రి మనోహర్ లాల్ కి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు లోని అంశాలు పరిశీలిస్తే.. ఈ సమావేశానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పరిపాలన శాఖ విడుదల చేసిన జీవో ప్రకారం, తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌ను ఈ సదస్సుకు పంపనున్నట్లు పేర్కొ నడం, ప్రజా ప్రాతినిధ్య నిబంధనలను ఉల్లంఘిం చడమేనని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. మేయర్‌గా ప్రజలచే నేరుగా ఎన్నికయ్యే వ్యక్తి, నగరానికి ప్రతినిధిగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందన్నారు. అలాంటి అధికారిక హోదా కలిగిన వ్యక్తిని పక్కన పెట్టి డిప్యూటీ మేయర్‌ను ఎంపిక చేయడం సబబు కాదని పేర్కొన్నారు. ఇది కేవలం ప్రోటోకాల్‌ను ఉల్లంఘిం చడం మాత్రమే కాదు, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, నిబంధనలను ఉల్లంగించడ మేనని ఎంపీ స్పష్టం చేశారు. తిరుపతి మేయర్ డాక్టర్ శిరీషా తిరుపతి నగరపాలక సంస్థకు మొట్ట మొదటగా ఎన్నికైన మహిళా మేయర్, ప్రముఖ వైద్యురాలు, బీసీ యాదవ కమ్యూనిటీకి చెందిన వారు కావడం విశేషం అని ఆయన తెలిపారు. ఆమె ఎన్నిక, సామాజిక న్యాయం, అలాగే పురుషు లతో సమానంగా రాజకీయాల్లో మహిళలు రాణిస్తు న్నారనేందుకు నిదర్శనమని ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు. ఈ ఘటనపై కేంద్ర హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వశాఖ తక్షణమే జోక్యం చేసుకొని, తిరుపతి మేయర్‌కు సదస్సుకు తగిన ఆహ్వానం అందేలా చూడాలని, అలాగే భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఎంపీ డిమాండ్ చేశారు.

మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీల్లో
రీ కౌన్సెలింగ్ నిర్వహించాలి

- తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద మహిళ సంరక్షణ కార్యదర్శుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన చేస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాలలో బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిన సందర్భంగా జూన్ 30 నాటికి సచివాలయాల సిబ్బంది బదిలీలు ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా సాగినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో మహిళా సంరక్షణ కార్యదర్శిల బదిలీలకు సంబంధించి రీ కౌన్సెలింగ్ నిర్వహించాలంటూ తిరుపతి జిల్లా కలెక్టరేట్ ఎదుట గ్రామ వార్డు సచివాలయ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు తోటకూర కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు మంగళవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో బదిలీల ప్రక్రియ నిబంధనలను అనుసరించి జరపలేదని, మహిళా సంరక్షణ కార్యదర్శులకు సంబంధించి రీ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బదిలీల ప్రక్రియలో ప్రామాణికంగా తీసుకోవలసిన సీనియార్టీ లిస్టు, ఖాళీల వివరాలను తెలియజేస్తూ నిబంధనల ప్రకారం నిర్వహించాల్సి ఉన్న ఆ దిశగా బదిలీల ప్రక్రియ జరగలేదని ఆరోపించారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ పరిధిలో మహిళా కార్యదర్శులను జీవో ఎంఎస్ 6 ను పరిగణలోకి తీసుకొని వార్డు నుండి మరొక వార్డుకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామ సచివాలయాల్లో మండలం నుండి పక్క మండలాలకు ఈ జీవోను అనుసరించి బదిలీలు జరపాల్సి ఉన్నా, ప్రస్తుతం జరిగిన బదిలీ ప్రక్రియ ద్వారా 70 నుండి 80 కిలోమీటర్ల ఏరియాలకు బదిలీలు చేశారని, దీంతో చాలీచాలని జీతాలతో బ్రతుకీడిస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శులకు విధుల నిమిత్తం ప్రయాణాలలో భద్రత కరువు అవుతుందని, అందుకే మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీల ప్రక్రియలో రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరుతున్నామన్నారు. స్పౌజ్, మెడికల్ క్యాటగిరి కింద బదిలీలు నిబంధనలకు విరుద్ధంగా జరిపారని, స్పౌజ్ మెడికల్ గ్రౌండ్స్ వారిని రేషనలైజేషన్ జీవో ప్రకారం ఎక్కడైతే మహిళా పోలీసుల పోస్టులు ' ఎస్ ' అని ఉంటాయో వారితో ఫిల్ చేసి మెరిట్ లో ఉన్న మహిళా పోలీసులను రేషనలైజేషన్ జీవో ప్రకారం మహిళా పోలీస్ సిబ్బంది లేనటువంటి సచివాలయాలలో పోస్టింగులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నిర్ణయం వలన మెరిట్ లిస్టులో ఉన్నవారికి తీవ్ర అన్యాయం జరిగిందని కలెక్టర్ ఎదుట వాపోయారు. వీటన్నింటి దృష్ట్యా సమాఖ్య చూపుతున్న కారణాలను పరిగణలోకి తీసుకొని రీ కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జ్ఞానాంబిక, విజయలక్ష్మి, నజ్మా, శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో చిరుత ప్రత్యక్షం



ప్రజాశక్తి - తిరుమల: తిరుమల అటవీప్రాంతం సమీపంలో మరోమారు చిరుత ప్రత్యక్షమైంది. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో చిరుత హెచ్.వి.సి...అన్నమయ్య భవన్ సమీపంలోని పార్క్ వద్ద పిట్టగోడపై కనపడడంతో అక్కడ సమీపంలో ఉన్న భక్తులు సెల్ ఫోన్ లో వీడియో తీశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది. చిరుత వచ్చిన ప్రాంతంలో సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది సైరన్ మోగించడంతో చిరుత అటవీప్రాంతంలో వెళ్ళింది. అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న యాత్రికులు జాగ్రత్తగా ఉండాలని టిటిడి విజిలెన్స్ సిబ్బంది సూచనలు చేశారు.

పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో తిరుపతి ప్రథమ స్థానం



కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి పింఛన్లు పంపిణీ చేస్తున్న డిఆర్డిఏ పిడి శోభన్ బాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సామాజిక పింఛన్ల పంపిణీలో రాష్ట్రవ్యాప్తంగా తిరుపతి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలతో ఉదయం నుండి జిల్లావ్యాప్తంగా పింఛన్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించి పర్యవేక్షణ చేసామన్నారు. సిబ్బంది సహకారంతో 95.89 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందన్నారు. కాగా తిరుపతి రూరల్ మండలం కాలూరు గ్రామం హరిజనవాడలో ఓ మహిళ తనకు రావలసిన పింఛన్ కన్నా తక్కువ ఇచ్చారంటూ పింఛన్ పంపిణీ సిబ్బందిని ప్రశ్నించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిపై డిఆర్డిఏ పిడి శోభన్ బాబును వివరణ కోరగా, అవకతవకలు జరగడానికి ఇట్టి పరిస్థితుల్లో వీలులేదని, కానీ ఏదైనా జరిగి ఉంటే విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

గంటసేపు విధులు బహిష్కరించిన స్విమ్స్ కార్మికులు



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: స్విమ్స్ ఆసుపత్రిలో కార్మికులు చేస్తున్న పోరాటం రోజు రోజుకు మరింత తీవ్రతరం అవుతోంది. నిరసన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం గంటపాటు కార్మికులు విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. పద్మావతి హాస్పిటల్ నుండి ర్యాలీగా క్యాన్సర్ వార్డు, ఎన్టీఆర్ విగ్రహం మీదుగా, ప్రధాన రోడ్డు వరకు వెళ్లి తిరిగి మళ్లీ ఎన్టీఆర్ విగ్రహం వద్దన్న దీక్షా శిబిరం వద్దకు చేరుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ స్విమ్స్ కార్మికులు చేపట్టిన పోరాటం మంగళవారం ఆరవ రోజుకు చేరుకున్నదని తెలిపారు. నేటి నుంచి ప్రతి రోజు గంట పాటు విధులు బహిష్కరించి నిరసన చేపడతారని తెలిపారు. టీటీడీ ఈవో శ్యామల రావు నేడు అమెరికా నుండి తిరుపతికి చేరుకొని విధులలో ఉంటారని, ఈ సమస్య వారి దృష్టికి తీసుకెళ్తామని స్విమ్స్ యాజమాన్యం నూతనంగా ఏర్పడిన కమిటీ ఇదివరకే తెలియజేయడం జరిగిందన్నారు. వెంటనే ఈ సమస్యను స్విమ్స్ యాజమాన్యం టీటీడీ ఈవో దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కరించాలని లేనిపక్షంలో పనులు ఆపేసి సమ్మెలోకి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్మికులందరికీ హోదాలో మార్పు చేసి శానిటేషన్ పదాన్ని తొలగించి, వేతనాలు పెంచాలని రిలీవర్లు కార్పొరేషన్ అన్న తేడా లేకుండా అందరికీ ఒకే రకమైన పద్ధతిని కొనసాగించాలని, అందరినీ కార్పొరేషన్ లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మిగిలిన విభాగాల వారికి పెరిగినట్లుగా వార్డు బాయ్స్‌గా పని చేస్తున్న వారికి కూడా అదే పద్ధతిలో జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నేతలు టి సుబ్రమణ్యం, కే వేణుగోపాల్, ఎన్ మాధవ్, పి బుజ్జి, బి శ్రీరాములు, సిమ్స్ యూనియన్ నేతలు జి.రవి,, వి సూరి, గోపి, రత్నవేలు, భాష, కుమారి, జయమ్మ, మారి ముత్తు, వెంకటేష్, మునికృష్ణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర గొలుసు దొంగలు అరెస్టు

- భారీగా సొత్తు స్వాధీనం



దొంగల అరెస్ట్‌కు కృషి చేసిన పోలీసులకు రివార్డు

ప్రజాశక్తి- తిరుపతి సిటి : ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని గొలుసు దొంగతనాలకు పాల్పడే అంతర్రాష్ట్ర దొంగలను శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు 13 లక్షల విలువచేసే సొత్తును, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు మంగళవారం మీడియాకు వివరించారు. శ్రీకాళహస్తి వన్ టౌన్, టూ టౌన్, తొట్టంబేడు, రేణిగుంట రైల్వే పోలీస్ స్టేషన్ ల పరిధిలో ఇటీవల ఆరు చైన్ స్నాచింగ్ ఘటనలు జరిగాయి. ఈ కేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు అదనపు ఎస్పీ నాగభూషణం, శ్రీకాళహస్తి డిఎస్పీ నరసింహమూర్తి, తిరుపతి క్రైమ్ డిఎస్పీ శ్యామ్ సుందర్ నేతృతంలో బృందాలను ఏర్పరిచి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం మిట్టకండ్రిగ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు ద్విచక్ర వాహనంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు పట్టు పడ్డారు. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి 139.170 గ్రాముల బంగారాన్ని, ఒక స్ప్లెండర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డవారిలో తమిళనాడుకు చెందిన ముత్తం మణి మారన్ (29), తిరుపతి జిల్లాకు చెందిన మారి మాణిక్యం(25), కొట్టంబేటి రాజ(20)లు ఉన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. గొలుసు దొంగలను పట్టుకోవడంలో కృషి చేసిన వన్ టౌన్ సీఐ గోపి, తదితరు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కనిపించే దేవుళ్ళు వైద్యులు : గుడ్లూరు మయూర్



డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తి తీసుకువచ్చిన ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తల్లి జన్మనిస్తే.. వైద్యులు పునర్జన్మనిచ్చి కనిపించే దేవుళ్ళుగా కొనియాడబడుతున్నారని ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ పేర్కొన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తి తీసుకువచ్చిన ప్రత్యేక సంచికను మంగళవారం ఆయన స్థానిక ఎంజీఎం ఆసుపత్రి వద్ద ఆవిష్కరించారు. వైద్య రంగానికి ప్రజాశక్తి అందిస్తున్న సహకారాన్ని ఈ సందర్భంగా కొనియాడారు. డాక్టర్స్ డే సందర్భంగా వైద్యుల సేవలను గుర్తు చేసుకుంటూ, వారిని సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎంజీఎం ఆసుపత్రిలో 17 విభాగాలకు చెందిన అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయనీ, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంజీఎం వైద్యులు వివేక్ చైతన్య, దినేష్, డాక్టర్ ఉమా మహేశ్వరరావు, ఐశ్వర్య, అర్చన, శ్వేత, రిజ్వానా, పార్తీబన్, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ హరి కిషోర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా డెస్క్ ఇన్చార్జి అవనిగడ్డ వనజ, ప్రజాశక్తి మేనేజర్ ప్రసాద్, నాగరాజు, సురేష్, కిషోర్, కామేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని నీర్పాకోట గాజుల పెళ్లూరు, పార్లపల్లి గ్రామాలలో మంగళవారం ఉదయం అగ్రికల్చర్ అధికారి షణ్ముగం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా చాలామంది రైతులు డ్రం సీడ్ పద్దతిలో వరి నాట్లు వేసి ఉన్నారు. ఈ పొలాల్లో కలుపు నివారణకు సంబంధించి కౌన్సిల్ అక్క్ లాంటి వీడి సైడ్స్ రైతులకు రె కమెండ్ చేసి తగిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. అన్నదాత సుఖీభవకు సంబంధించి ఈ కేవైసీ పెండింగ్ ఉన్న రైతులకు ఈ కేవైసీ పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రేవతి మండల అగ్రికల్చర్ ఆఫీసర్ షణ్ముగం పాల్గొన్నారు.

ఘనంగా రంగినేని జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: టిడిపి సీనియర్ నేత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు జన్మదిన వేడుకలు మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలుచోట్ల ఆయన అభిమానులు భారీ కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఏరియా హాస్పిటల్ రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు అందజేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఫోన్ ద్వారా రంగినేనికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు నేతలు ఆయన ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు అందజేశారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీవో ఎంపీడీవో వెంకటరత్నమ్మ పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు త్రాగునీరు లేకపోవడం, ఎండ తీవ్రత..నీడ లేకపోవడం వంటి సమస్యలను ఎంపీడీవోకు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీల సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో సూచించారు. అనంతరం చెత్త సంపద కేంద్రానికి వెళ్లి అక్కడ పరిసరాలను పరిశీలించారు.

విధులకు గైర్హాజరైన స్కూల్ అసిస్టెంట్ తొలగింపు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: అనుమతి లేకుండా 7 సంవత్సరాలకు పైగా విధులకు గైర్హాజరైన స్కూల్ అసిస్టెంట్ హరిబాబును జిల్లా విద్యాశాఖ అధికారి విధులనుండి తొలగించారు. హరిబాబు బియన్ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఆగష్టు 2017 నుండి ఆగష్టు 2024 వరకు ఎటువంటి సమాచారం లేకుండా, విధులకు రానందున విచారణ అధికారిని నియమించి, విచారణ అనంతరం ఆయనను విధుల నుండి తొలగించినట్లు తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ తెలియజేసినట్లు, బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఒక తెలియజేశారు.

సామాజిక ఫించన్లు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, నల్లజాలమ్మ వీధిలో మంగళవారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ లబ్దిదారుల ఇంటికి వెళ్ళి పెన్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, స్థానిక టిడిపి నాయకులు, చెన్నూరు నీటి సంఘం అధ్యక్షులు యారమావు హేమంత్ కుమార్ రెడ్డి, ఇందుకూరు శ్రీకాంత్ రెడ్డి, ముప్పాల గిరిధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బియన్ కండ్రిగ: మంగళవారం బుచ్చినాయుడు కండ్రిగ మండలం, బీసీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయండి

ప్రజాశక్తి - తొట్టంబేడు : అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు, సాగు భూమి ప్రభుత్వం మంజూరు చేయాలంటూ తొట్టంబేడు మండల తాసిల్దార్ భారతికి సి.పి.ఐ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సి.పి.ఐ పార్టీ నాయకులు మించల శివకుమార్ మాట్లాడుతూ ఎల్.ఐ.సి కాలనీ, ఈదులగుంట, శివనాథపాలెం, బీ.డీ కాలనీ, కారాకొల్లు గ్రామాల్లో నివసించే పేదలకు సొంత గృహాలు లేవని, వారిలో అర్హులైన వారిని గుర్తించి ఇంటి స్థలాలు మంజూరు చేసి, గృహ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రుద్రపాక శ్రీనివాసులు, నరసింహారావు, మనీ, వెంకటేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాకాణిని పరామర్శించనున్న జగన్

ప్రజాశక్తి - వాకాడు : అక్రమ కేసుపై అరెస్టయిన నెల్లూరు జిల్లా వైసిపి పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని పరామర్శించేందుకు 3న వైఎస్ జగన్మోహన్ రెడ్డి రానున్నారని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా, వాకాడులోని ఆయన నివాసం వద్ద విలేకరుల సమావేశంలో ఈ ప్రకటన చేశారు.

సార్వత్రిక సమ్మెకు సిపిఐ మద్దతు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : కేంద్ర కార్మిక సంఘాలు, స్థానిక ఫెడరేషన్లు పిలుపునిచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జూలై 9 వ తేదీన జయప్రదం కావాలని, సార్వత్రిక సమ్మెకు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తిరుపతి జిల్లా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ప్రత్యక్షంగా పాల్గొంటామని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అమలుపరుస్తున్నాయని ఆయన ఆరోపించారు. లేబర్ కోడ్‌లతో కార్మిక వర్గం కష్టం బానిసలుగా మారిపోతారని. సంఘం పెట్టుకునే హక్కు కోల్పోతారని కార్మిక శాఖలు నిర్వీర్యం చేస్తున్నారని సమ్మె చేసే హక్కు కార్మిక వర్గం వదులుకోవాల్సి వస్తుందన్నారు. జూలై ఆరవ తారీఖున జరిగే బైక్ ర్యాలీలకు, జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో ప్రదర్శనలకు ర్యాలీలకు సభలకు, నిరసన కార్యక్రమాల్లో సిపిఐ శ్రేణులు పాల్గొంటారని తెలియజేశారు.

జగన్‌ను యువత నమ్మడు : శాప్ చైర్మన్

ప్రజాశక్తి - క్యాంపస్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని రాష్ట్రంలోని యువత ఎవరూ నమ్మే పరిస్థితి లేదని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన యువజన విభాగం సమావేశంలో కూటమి ప్రభుత్వాన్ని ప్రజా వ్యతిరేక ప్రభుత్వమంటూ జగన్ చేసిన వ్యాఖ్యలను శాప్ చైర్మన్ తీవ్రంగా ఖండించారు. యువత భవిష్యత్తుతో ఆటలాడుకున్న సైకో జగన్ యువతను తిరిగిదిద్దుతామనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. ఐదేళ్ల పాలనలో ఏం చేశావని ఇప్పుడు యువత కోసం మాట్లాడుతున్నావంటూ దుమ్మెత్తిపోశారు. జగన్ తన రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం యువతను వాడుకునే ప్రయత్నం చేస్తున్నారని, యువత దీన్ని గ్రహించాలన్నారు.

తొన్నాటి చంద్రయ్యకు నివాళి

ప్రజాశక్తి - తొట్టంబేడు : మండలంలోని కాసరం గ్రామంలో నివాసముంటున్న తొన్నాటి చంద్రయ్య అనారోగ్య కారణంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి మండల అధ్యక్షుడు కోగిల సుబ్రహ్మణ్యం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాల వితరణ



డాక్టర్స్ డే సందర్భంగా విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేస్తున్న డాక్టర్ ఏ ఆర్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: స్థానిక బేరీ వీధి లోని (కస్తూరిబా స్ట్రీట్) మున్సిపల్ కార్పొరేషన్ మోడల్ ప్రైమరీ స్కూల్, మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో ఈరోజు ఉదయం డాక్టర్స్ డే సందర్భంగా ప్రముఖ శ్వేత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఏ ఆర్ రెడ్డి వారి బృందంచే పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకములు, జామెంట్రీ బాక్సులు విద్యార్థులకు అందచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ ఏ ఆర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ నరసింహ చారి ప్రముఖ వైద్యులు డాక్టర్ పి రెడ్డప్ప హాజరయ్యారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ ఏ ఆర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటినుంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని, బాగా ఇష్టపడి కష్టపడి చదవాలని, బాగా చదివి మంచి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, విద్యార్థులకు విద్య భవిష్యత్తులో పెద్ద ఆస్తి అని, విద్యార్థులు తల్లిదండ్రులని, ఉపాధ్యాయులని గౌరవించాలని, మంచి నడవడిక అలవర్చుకోవాలని, సందర్భంగా తెలియజేశారు. స్థానిక కార్పొరేటర్ నరసింహ చారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పించిందని విద్యార్థులు వాటి ఉపయోగించుకుని చక్కగా చదువుకోవాలని ప్రవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మున్సిపల్ పాఠశాలలు ఉన్నాయని ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని భవిష్యత్తులో మంచిగా రాణించాలని, ఈ పాఠశాల అభివృద్ధికి మున్సిపల్ కమిషనర్ గారి సహాయ సహకారంతో అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలియజేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ పి రెడ్డప్ప మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే విద్య పట్ల మక్కువ పెంచుకోవాలని, చదువులో బాగా రాణించాలని, భవిష్యత్తులో ఎవరికి నచ్చిన వృత్తిని వారు ఎంచుకోవాలని తెలియజేస్తూ, డాక్టర్ ఏ ఆర్ రెడ్డి సేవలను కొనియాడారు. పాఠశాల కూడా కొంత సహకారం ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎ ఆర్ రెడ్డి అందిస్తారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎన్ భానుమతి, మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కృష్ణ కుమార్, ఉపాధ్యాయులు కే హరికృష్ణ బాబు, పి కవిత, ఇతర ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు బండి మధుసూదన్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

'బీసీ ఆత్మ గౌరవ భరోసా'ను జయప్రదం చేయండి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : 6వ తేదీన తిరుపతి, ఇందిరా మైదానంలో జరిగే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం, అంబేద్కర్ పూలే-ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీ ఆత్మగౌరవ భరోసా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ మంత్రి, అంబేద్కర్-పూలే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పరసారత్నం కోరారు. ఈ సందర్భంగా గూడూరు, హెడ్ పోస్ట్ ఆఫీస్ ప్రాంతంలో ఏర్పాటై ఉన్న పూలే విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం గూడూరు నియోజకవర్గ అధ్యక్షులు తళ్ళం ప్రసాద్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీలు ఐక్యంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈనెల 6 న తిరుపతిలో జరిగే బీసీ ఆత్మ గౌరవ సభలో నియోజక వర్గంలోని ఎస్సీ, బీసీలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ అల్మెన్ రాజు, జానపద కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు యాదగిరి, తిరుపతి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగరాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి పాలూరు నాగార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అధినేతను కలిసిన పాలేటి నాగార్జున



ప్రజాశక్తి - నాయుడుపేట: మంగళవారం తాడేపల్లిలోని వైయస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో యువజన విభాగం రాష్ట్ర స్థాయి సమావేశంలో భాగంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిశానని కౌన్సిలర్ నాగార్జున ఒక ప్రకటనలో తెలియజేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గ యువజన అధ్యక్షుడు మరియు నాయుడుపేట మున్సిపల్ కౌన్సిలర్ పాలేటి.నాగార్జున మాట్లాడుతూ మా అధినేత వైయస్సార్సీపీ వ్యవస్థాపకుడు వైస్.జగన్మోహన్ రెడ్డిని కలిసిన సందర్భంగా ఆయన ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి వర్గం గురించి ప్రత్యేకించి మాట్లాడుతూ సంజీవన్న ఎలా ఉన్నాడు అంటూ నియోజకవర్గంలోని ప్రజలు బాగోగులు వైసిపి కార్యకర్తల మంచి చెడుల గురించి అడుగుతూ రాబోయే 2029 ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తామని రెట్టించిన ఉత్సాహంతో నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని తెలిపారన్నారు. మళ్లీ జిల్లాల పర్యటనలో భాగంగా నియోజకవర్గంలోని అందరినీ కలుస్తానని చెప్పారని తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా కృప చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టర్ రోహిణిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వహుకులు మాట్లాడుతూ వైద్యుల సేవలు మరువలేనివన్నారు. డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు మంజరి గోపాల్, సెక్రటరీ రమణయ్య, సురేంద్ర బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విష్ణుశ్రీలో హాస్పిటల్‌లో..

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: విష్ణు శ్రీ హాస్పిటల్ అధినేత డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగం అభివృద్ధి చెందాలని, రోగులకి అన్ని రకాలుగా సేవలు అందించాలని, మానవ సేవ భావించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రమాదేవి ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం ..

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించని శ్రీ రమాదేవి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక సాయిరాం వీధిలోని హాస్పిటల్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ బి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ వైద్య శిబిరంలో సుమారు 110 మంది రోగులు పాల్గొన్నారని తెలిపారు. వైద్య శిబిరంలో ఉచితంగా ఎక్సరేలు, వైద్య పరీక్షలు, మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాధాకృష్ణారెడ్డి, డాక్టర్ రాజేష్, డాక్టర్ కిషోర్, డాక్టర్ మనోజ్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ ప్రశాంత్, వైద్యులు పాల్గొన్నారు.

తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రిలో..

తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రిలో మంగళవారం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు ఆధ్వర్యంలో చికిత్స పొందుతున్న రోగులకు డాక్టర్స్, ఐఎంఎ తిరుపతి శాఖ యూనియన్ ఆధ్వర్యంలో పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది డాక్టర్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, స్పెషల్ గ్రేడ్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ వెంకయ్య, ఇతర డాక్టర్లు పాల్గొన్నారు.

యస్వీయు రిటైర్డ్ టీచర్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - క్యాంపస్: యస్వీయు రిటైర్డ్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్ విజయవంతమైనట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆచార్య అప్పారావు, ఆచార్య కృష్ణమూర్తి లు ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలోని రిటైర్డ్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనం ముందు మంగళవారం ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించి నట్లు వారు తెలిపారు.

31వ వసంతాలు పూర్తి చేసుకున్న సుభాషిణి హాస్పిటల్..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరులోని సుభాషిణి ఆసుపత్రిలో మంగళవారం డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ శ్రీధర్ రాజు, డాక్టర్ సుభాషిణిలను ఘనంగా సన్మానించారు.



ప్రజాశక్తి - తిరుపతి సిటీ, టౌన్: ఆధార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రఫీ ఆధ్వర్యంలో తిరుపతి రుయా హాస్పిటల్‌లో డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుయా హాస్పిటల్ సూపర్డెంటెడ్ డాక్టర్ రాధా, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి ప్రభు, ట్రాఫిక్ సిఐ సంజీవ్ కుమార్, తుడా చైర్మన్, టీటీడీ ఎక్స్ అఫీషియో సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు దైవంగా భావించేది ఒక్క డాక్టర్ నేనని గుర్తు చేశారు. ఈ సందర్భంగా రూయ హాస్పిటల్లో 30 ఏళ్ల క్రితం నిర్మించిన సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంను ఆధునికరించాలని సూపర్డెంట్ డాక్టర్ రాధా కోరారు. తుడా చైర్మన్ స్పందిస్తూ త్వరలోనే ఆధునికరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డాలర్స్ దివాకర్ రెడ్డిని సత్కరించారు.

కార్మికుల సమ్మెతో మోడీ మెడలు వంచుదాం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈ నెల 9వ తేదీన జరిగే అఖిల భారత కార్మిక సమ్మె ద్వారా మోడీ మెడలు వంచేందుకు కార్మిక వర్గం సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్టీయూ కార్మిక సంఘాల నాయకులు మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సమ్మెను జయప్రదం చేయడంలో అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. దేశంలో మోడీ పాలన మొదలయ్యాక కార్మిక వర్గాలు అణచివేతకు గురయ్యాయనీ, కార్పొరేట్లకు ఎర్ర తివాచీ పరిచారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య విమర్శించారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకురావడం మోడీ కుట్రలో భాగమన్నారు. ఏపీలో 10 గంటల పని విధానాన్ని అమలు పరచడం మోడీ, బాబు, పవన్‌ల కార్పొరేట్ మైత్రీకి నిదర్శనమన్నారు. మోడీ విధానాలపై తిరగబడకుంటే కార్మిక వర్గాల భవితవ్యం అంధకారమేనని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు కత్తి రవి, మల్లి, ఐఎఫ్టీయూ నాయకులు జాకీర్, సీఐటీయూ నాయకులు పెనగడం గురవయ్య, వెంకటేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

పాకాల ఆర్టీసీ బస్టాండ్‌లోకి ప్రైవేటు వాహనాలు

- ఇబ్బంది పడుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ప్రయాణికులు
- ఆర్టీసీ బస్టాండ్ ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేయాలి చేయాలి : మధుసూదన్ రావు



ప్రజాశక్తి - రామచంద్రాపురం (పాకాల) తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, స్థానిక పాకాల ఆర్టీసీ బస్టాండ్ లో ప్రైవేటు వాహనాల రాకపోకలతో బస్సు డ్రైవర్లు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు వాహనాలైనా లారీలు, ఆటోలు, కార్లు, జీపులు అనుమతులు లేకుండా యదేచ్ఛగా రాకపోకల సాగించడంతోపాటు పార్కింగ్ కూడా చేస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి వచ్చి, ఫ్లాట్ ఫారం వద్ద ప్రయాణికులను ఎక్కించుకుని, బస్టాండ్ నుండి బయటకు వెళ్లాలంటే బస్సు డ్రైవర్లు ఇబ్బది పడుతున్నారు. ప్రైవేటు వాహనాలు బస్టాండ్లోకి రాకుండా ఆర్టీసీ అధికారులు కట్టడం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్టాండ్ ప్రహరీ గోడ నిర్మాణం కొంత భాగం జరిగి, ఆగిందని ఆర్టీసీ బస్టాండ్‌కు పూర్తిస్థాయి ప్రహరీ గోడ ఏర్పాటు చేసి ప్రైవేటు వాహనాలను బస్టాండ్ లోకి రాకుండా స్థానిక పోలీసులు సహకారంతో కట్టడి చేయాలని సిఐటియు జిల్లా సభ్యులు మధుసూదన్ రావు డిమాండ్ చేశారు. స్థానిక శాసనసభ్యులు పులివర్తి నాని ఆర్టీసీ బస్టాండ్ ప్రహరీ గోడ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కెవిపిఎస్ మండల అధ్యక్షుడు మురళి కోరారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలోని దుకాణాల ముందు ఆర్టీసీ అధికారులు ఆక్రమణ తొలగించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా 8వ జీఎస్టీ దినోత్సవం వేడుక

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి సీజీఎస్టీ కమిషనరేట్ తలపెట్టిన 8వ జీఎస్టీ దినోత్సవ వేడుకలు మంగళవారం కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా, ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సంవత్సరం థీమ్ం "పన్నులు సరళీకరణ %-% పౌరులకు సాధికారత". ఈ వేడుకలు, భారతదేశంలో పరోక్ష పన్నుల వ్యవస్థను సరళీకరిస్తూ, ఎనిమిదేళ్ల క్రితం అమలులోకి వచ్చిన గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (జీఎస్టీ) ను స్మరించుకుంటూ జరుపబడ్డాయి. ఈ కార్యక్రమానికి పి. ఆనంద్ కుమార్, కమిషనర్, తిరుపతి సీజీఎస్టీ కమిషనరేట్ అధ్యక్షత వహించారు. గౌరవ అతిథిగా డా. రవీంద్ర సన్నారెడ్డి, వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ సిటీ ప్రైవేట్ లిమిటెడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పన్ను అనుగుణత, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రోత్సహించడంలో శాఖ చేస్తున్న కృషిని ప్రశంసించారు. పన్ను చెల్లింపుదారుల సౌలభ్యం, పారదర్శకత మరియు సమర్థవంతమైన పన్ను పరిపాలన కోసం శాఖ కట్టుబడి ఉంది" అని చెప్పారు. అలాగే, భాగస్వాములందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్. దినకరణ్, సంయుక్త కమిషనర్ అంబే ఎం, ప్రముఖ అధికారులు కూడా పాల్గొన్నారు.

డిగ్రీ ఐదవ సెమిస్టర్ ఇన్‌స్టెంట్ పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ఐదో సెమిస్టర్ ఇన్ స్టంట్ పరీక్షలు నాలుగు రోజుల పాటు వాయిదా వేస్తున్నట్టు యస్వీయూ పరీక్షల నియంత్రణాధికారి తెలిపారు. జులై నెల 2 వ తేదీన ప్రారంభం కావాల్సిన యుజి ఐదవ సెమిస్టర్ ఇన్ స్టెంట్ పరీక్షలు జూలై 7 వ తేదీ నుంచి జరుగుతాయని, పరీక్షల నూతన టైం టేబుల్‌ను యస్వీయూ పరీక్షల వెబ్‌సైట్‌లో చూడొచ్చని తెలిపారు.

వైద్యులు సేవాదృక్పథంతో పనిచేయాలి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వేమన విజ్ఞానకేంద్రం, ప్రణీత్ ఫౌండేషన్, ఇంపాక్ట్ యూనివర్సల్ ట్రూ ఎండీవర్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ రాజారెడ్డి ప్రారంభించారు. ఈ సంధర్భంగా జరిగిన సభకు పంచముఖేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్లను గౌరవించాలని, సమాజ అభివృద్ధిలో వారి పాత్ర ముఖ్యమని అభిప్రాయపడ్డారు. ప్రణీత్ పౌండేషన్ వ్యవస్థాపకులు ప్రణీత్ పెనుమాడు మాట్లాడుతూ డాక్టర్లపై వివిధ రకాల ఒత్తిళ్లు ఉండే అవకాశం ఉందని, అయినా ప్రజల ఆరోగ్యంపై వారు చూపించే అంకితభావం ప్రశంసనీయమన్నారు. ప్రముఖ వైద్యులు డా.కె.రాజా రెడ్డి మాట్లాడుతూ వైద్య విద్య ఒక గొప్ప బాధ్యతతో కూడిన దని తెలిపారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలందించిన డాక్టర్లను సన్మానించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేమన విజ్ఞానకేంద్రం ప్రధానకార్యదర్శి మల్లారపు నాగార్జున, టెంకాయల దామోదరం, డా. రవీంద్ర, శ్రీధర్ విట్టలం, నెల్లూరు మునిలక్ష్మి తహసున్నేషా బేగం, రాజేష్, ప్రభాకర్, జయశంకర్, మోహన్, జ్యోతిష్, బాలకృష్ణ, గురునాథం, రెడ్డప్ప, మోహన్ రావు, రఫీ గార్లు తదితరులు పాల్గొన్నారు.

ఎదోద్వాజ ప్రైవేట్ లిమిటెడ్

"ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్" (ఫ్లో బస్) ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : జూలై 1, 2025న ఎస్పీఎంవివి విసి ప్రొఫెసర్ వి. ఉమ ద్వారా, భారతదేశంలో మొట్టమొదటి ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్ (ఫ్లో బస్) ని ఆంధ్రప్రదేశ్‌లో మంగళవారం మహిళా వర్సిటీ క్యాంపస్‌లో ప్రారంభించారు. ఎదోద్వాజ ప్రైవేట్ లిమిటెడ్ రూపొందించిన విప్లవాత్మక మొబైల్ ల్యాబ్, ఎస్ పి ఎంవివి యొక్క ఎస్ఎస్ ఐ ఐ ఇ - టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్లో ఇంక్యుబేట్ చేయబడింది. స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్ కింద టిబిఐ ద్వారా 25 లక్షలు మంజూరు చేయబడిందన్నారు. తెలంగాణలో 40,000 కంటే ఎక్కువ మంది విద్యార్థులను విజయవంతంగా ప్రేరేపించిన తర్వాత, ఫ్లో బస్సు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించింది, ఎస్ పి ఎంవివి లో తన ప్రయాణాన్ని ప్రారంభించింది, ఇక్కడ విద్యార్థులు, అధ్యాపకులు మరియు ఇతర సభ్యులు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను అన్వేషించే అవకాశాన్ని పొందారు.

ఆకలి లేని భారత దేశమే లక్ష్యం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): భారతరత్న ఎంఎస్ స్వామినాథన్ భారతదేశంలో ఆకలి లేని రోజులు చూడాలని ఎంతో ముందు చూపుతో ఎన్నో కార్యక్రమాలు చేశారని, ఆయన స్ఫూర్తితో వచ్చేనెల 7వ తేదీ ఆయన జయంతిని పురస్కరించుకొని తిరుపతి నగర పరిధిలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సొసైటీ ఫర్ హంగర్ ఎలిమినేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజగోపాల్ తెలిపారు. గ్రీన్ రెవల్యూషన్ తీసుకువచ్చిన స్వామినాథన్ ఆశయ సాధన కోసం సొసైటీ ఫర్ హంగర్ ఎలిమినేషన్ ఎల్లప్పుడూ పనిచేస్తుందని తెలిపారు.

క్రైం న్యూస్

ట్రాక్టర్లు, జెసిబి స్వాధీనం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణ పరిధిలోని స్వర్ణముఖి నది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను, ఓ జెసిబిని సోమవారం రాత్రి టూ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. స్టేషన్‌కు తరలించి సదరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ముందస్తుగా వచ్చిన రహస్య సమారంతో సీఐ నాగార్జున రెడ్డి బృందం దాడులు జరపగా నది వద్ద ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు, జెసిబిని పట్టుకున్నారు. రాత్రి వేళల్లో ఇసుక తవ్వకాలపై నిషేధం ఉన్నా కొందరు అతిక్రమించి ఇసుక తవ్వకాలు చేస్తున్నారని సిఐ తెలిపారు. అలాంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.


కాళంగి నదిలో తేలిన బాబురెడ్డి మృత దేహం



బాబు రెడ్డి మృత దేహం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ఆలత్తూరు పంచాయతీకి చెందిన సన్నా రెడ్డి జైరామ రెడ్డి కుమారుడు బాబు రెడ్డి (55) మంగళవారం ఉదయం పశువుల తోలుకొని ఆలత్తూరులోని ఏరు దాటుతుండగా ఒక్కసారిగా నీటి ప్రవాహం ఎక్కువ అవడంతో కనబడకుండా పోయాడు. ఉదయం 11 గంటలకు నదిలో గల్లంతైన బాబు రెడ్డి మృతదేహం రెండున్నర గంటలకు లభ్యమైనట్లు గ్రామస్తులు తెలియజేశారు. బాబు రెడ్డి రోజూ పశువులని మేపుటకు నది దాటి పొలాల్లోకి పోయేవాడని తెలియజేశారు. గాలింపు చర్యలు చేపట్టి నదిలో ఒక గుంతలో ఇరుక్కుపోయి ఉన్న బాబు రెడ్డి మృతదేహాన్ని బయటకు తీశామన్నారు. స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ నాయుడు సంఘటన స్థలానికి చేరుకొని బాబు రెడ్డి మృతదేహాన్ని పంచినామా నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటలుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రైలు ఢీకొని టీడీపీ నాయకుడు మృతి



వెంకటసుబ్బయ్య (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక వీరారెడ్డిపల్లి ప్రాంతానికి చెందిన 27వ వార్డు టీడీపీ కార్యదర్శి వెంకటసుబ్బయ్య (48) జీవాలను పెంచుతూ పాడిరైతుగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం గాంధీనగర్ సమీపంలోని రైలుపట్టాల వద్ద జీవాలను మేతకు తీసుకువెళ్లి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాదంలో మృతి చెందిన గుణశేఖర్, ఇన్‌సెట్‌లో ఫైల్ ఫోటో

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/తొట్టంబేడు : రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలైన విషాద ఘటన తొట్టంబేడు మండలంలోని పెద్దకనపర్తి సమీపంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దకనపర్తి దళిత వాడకి చెందిన బుడ్డా పరంధామయ్య, సుశీలమ్మల చిన్న కుమారుడు గుణశేఖర్(19) శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం యధావిధిగా విధులకు హాజరై తిరిగి ఇంటికి వెళ్తుండగా స్వగ్రామానికి అతి సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ గుణశేఖర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారంతో బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని గుణశేఖర్ ను ఆస్పత్రికి తరలించినా లాభం లేకుండా పోయింది. చేతికి అందొచ్చిన కొడుకు అకాల మరణం చెందడంతో పరంధామయ్య ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -కోట : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణంలో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంతవరకు పట్టించుకోవడం లేదని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శిజి శశి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కోట తహసీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం శశి కుమార్ మాట్లాడుతూ కోట మండల వ్యాప్తంగా అనేకమంది పేదవాళ్లు ఇళ్ల స్థలాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు లేవనే సాకుతో తల్లికి వందనం పథకానికి అనర్హులుగా చాలామందిని గుర్తిస్తున్నారన్నారు. ఆటో నడుపుకుని జీవిస్తున్న పేదల పొట్ట కోరుతున్నారని తెలిపారు. వాహన మిత్ర తొందరగా అమలు చేసిన ఆటో కార్మికులను ఆదుకోవాలని తెలిపారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున రావు కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి కె నారాయణ, జిల్లా నాయకులు శేషయ్య, భాస్కర్, కృష్ణ, శెట్టి, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

5 న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : 5వ తేదీ జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలిని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్ సి రాఘవేంద్ర తెలిపారు. మంగళవారం పుత్తూరు సబ్ కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పుత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సి జానకి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమ్య సాయి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గాలి సురేష్ బాబు, కార్యదర్శి రాజేష్, సీనియర్ న్యాయ వాదులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

A.S.No. 3/2024

ఎమ్.సుబ్రమణ్యం. ...అప్పీల్ దారు

Vs

ముల్లంగి చెంచు నాగరత్నమ్మ & వగైరాలు.

...రెస్పాండెంట్స్

4&6వ రెస్పాండెంట్స్‌నకు అప్పీలు సమన్లు

రెస్పాండెంట్ నెం.4&6:

4. అనిసెట్టి అన్నపూర్ణమ్మ, W/o లేట్ సుబ్రమణ్యం శెట్టి, నివాసం : యెర్రావారిపాలెం గ్రామం, పోస్ట్ & మండలం, (పూర్వం చిత్తూరు జిల్లా), ప్రస్తుతం తిరుపతి జిల్లా.

6. అనిసెట్టి సుధాకర్ శెట్టి, S/o లేట్ సిద్ధయ్య శెట్టి, నివాసం: యెర్రావారిపాలెం గ్రామం, పోస్ట్ & మండలం, (పూర్వం చిత్తూరు జిల్లా), ప్రస్తుతం తిరుపతి జిల్లా.

పై అప్పీల్ దారు దాఖలు చేసిన పై అప్పీల్ నందు మీ హాజరు నిమిత్తమై పై కనిన అప్పీల్ దావాను తేది: 05.08.2025వ తేదీన వాయిదా వేసిఉన్నారు. కావున మీరు నేరుగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని పై కోర్టులో 05.08.2025 తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై మీ వాద నలను తెలుపుకొనవలెను లేని యడల మీ పరోక్షమున తీర్పు ఇవ్వబడునని తెలియజేయమైనది.

//By Order of Court//

కె. సుధాకర రెడ్డి
న్యాయవాది, పీలేరు.

మహారాజశ్రీ పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

I.A.No. 13 of 2024

A.S.No. 3/2024

ఎమ్.సుబ్రమణ్యం. ...పిటిషనర్/అప్పీల్ దారు

Vs

ముల్లంగి చెంచు నాగరత్నమ్మ & వగైరాలు.

...రెస్పాండెంట్స్

4&6వ రెస్పాండెంట్స్‌నకు నోటీసు

రెస్పాండెంట్ నెం.4&6:

4. అనిసెట్టి అన్నపూర్ణమ్మ, W/o లేట్ సుబ్రమణ్యం శెట్టి, నివాసం : యెర్రావారిపాలెం గ్రామం, పోస్ట్ & మండలం, (పూర్వం చిత్తూరు జిల్లా), ప్రస్తుతం తిరుపతి జిల్లా.

6. అనిసెట్టి సుధాకర్ శెట్టి, S/o లేట్ సిద్ధయ్య శెట్టి, నివాసం: యెర్రావారిపాలెం గ్రామం, పోస్ట్ & మండలం, (పూర్వం చిత్తూరు జిల్లా), ప్రస్తుతం తిరుపతి జిల్లా.

పై పిటిషనర్ దాఖలు చేసిన పై I.A.No.13/2024 నందు మీ హాజరు నిమిత్తమై పై కనిన పిటిషన్‌ను తేది: 05.08.2025వ తేదీన వాయిదా వేసిఉన్నారు. కావున మీరు నేరుగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని పై కోర్టులో 05.08. 2025 తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై మీ వాద నలను తెలుపుకొనవలెను లేని యడల మీ పరోక్షమున తీర్పు ఇవ్వబడునని తెలియజేయమైనది.

//By Order of Court//

కె. సుధాకర రెడ్డి
న్యాయవాది, పీలేరు.

శ్రీ 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, గూడూర్ లో

O.P.No. 57/2024

Nelavala Meena Kumari, W/o. Nelavala Rajesh, aged 37 years, Hourse Maker Amaragarden, Naidupeta Town and Mandal, Tirupati District ... Petitioner

Vs

Nil .... Respondent

నోటీసు

పిటిషనర్ పై నెంబర్ గార్డియస్ O. P ని పై కోర్టులో తన కుమారుడు అయిన నెలవల జయదేవ్ మైనర్ అయినందున తన కుమారుడు పేరుమీద భీమవరం రెవిన్యూ, నాయుడుపేట మండలం లో కలిగిన ఆస్తిని అమ్ముటకు తనని గార్డియస్ గా నియమించమని పైన తెలిపిన పిటిషన్ వేసియున్నారు కావున ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల తే 11-07-2025 న ఉ.10.30 గంటలకు పై కోర్టులో మీరుగాని, మీతరుపున లాయరు గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపకోవలసినది. లేని యడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

ఇట్లు
M. Soma Sekhar, B.Sc., B.L.,
అడ్వకేట్, నాయుడుపేట.